క్లుప్తంగా

నేడు రైతులతో వీసీ

కొల్లాపూర్: మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు సోమవారం ఉద్యానశాఖ అధికారి లక్ష్మణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరి సాగు అంశంపై డాక్టర్ బి.శ్రీనివాస్ జగిత్యాల, ఆయిల్‌పామ్ సాగుపై కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ రాజశేఖర్, కూరగాయల సాగుపై డాక్టర్ కవిత రైతుల సందేహాలను నివృత్తి చేస్తారని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కార్పొరేషన్ ఏర్పాటుకు హర్షం

దోమలపెంట: తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు పూరి శ్రీను సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమితులైన కల్వ సుజాతకు శుభాకాంక్షలు తెలిపారు.

అడ్వైజర్ కమిటీ మెంబర్‌కు సన్మానం

తెలకపల్లి: కేంద్ర ప్రభుత్వ క్రీడలు యువజన సర్వీసుల శాఖ పరిధిలోని జిల్లా అడ్వైజర్ కమిటీ యూత్ ప్రోగ్రాం డీపీసీవైపీ నెహ్రూ యువ కేంద్రం అడ్వైజర్ కమిటీ మెంబర్ పరశురాములు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్‌లో బీజేపీ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి బంగారు శృతి పరశురాములను సన్మానించారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ఆకుల కృష్ణ, మండల అధ్యక్షుడు నరేంద్రాచారి పాల్గొన్నారు.

ఎస్సీ వసతి గృహాలను తనిఖీ చేసిన అధికారి

కొల్లాపూర్: పట్టణంలోని ఎస్సీ హాస్టల్స్‌ను ఎస్సీ సంక్షేమశాఖ డివిజన్ సహాయ కార్యదర్శి కే.సుదర్శన్ సోమవారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న హాస్టల్ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట వార్డెన్ సత్యనారాయణయాదవ్ ఉన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా శేఖర్

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కొప్పు శేఖర్ తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా సోమవారం నియామకం అయ్యారు. అనంతరం శేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర అధ్యక్షుడి చేతుల మీదుగా నియమాక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

ప్రధాన కార్యదర్శిగా తరుణ్

కల్వకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ విద్యార్థి అనుబంధ సంఘం ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన సంబు తరుణ్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం గాంధీభవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నుంచి నియామకపత్రాన్ని అందుకున్నాడు. అనంతరం కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్ రెడ్డి, ఇతర ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకత్వానికి సంబు తరుణ్ కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా ఆయా వార్డులతోపాటు ఎంపీ నిధుల ద్వార మంజూరైన రూ.8 లక్షలతో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.70 లక్షల నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు.

'పది' విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని గోరిట జెడ్పీహెచ్ పాఠశాల పదో తరగతి విద్యార్థుల పరీక్షల కోసం ఉచితంగా రవాణా సౌకర్యాన్ని ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి జుట్టు ఉత్తరయ్య, ఉపాధ్యక్షుడు వెంకటస్వామి సోమవారం ఏర్పాటు చేశారు. గోరిట గ్రామం నుంచి తిమ్మాజీపేట మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రానికి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి రవాణా చార్జీలను పాఠశాల హెచ్ఎం తిరుపతిరెడ్డికి విద్యార్థుల సమక్షంలో అందజేశారు.

సేవాలాల్ విగ్రహాన్ని తొలగించడం సరికాదు

కోడేరు: మండలంలోని ఎత్తం గట్టు దగ్గర ఏర్పాటు చేసిన సేవాలాల్ విగ్రహాన్ని ఫారెస్టు అధికారులు సమాచారం ఇవ్వకుండా విగ్రహాన్ని తొలగించడం సరికాదని గిరిజన సంఘం నాయకులు భీముడునాయక్, రాజేష్‌నాయక్, శ్రీరాములునాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని తొలగించి గిరిజనుల మనోభావాలను దెబ్బతీశారని వాపోయారు.

కల్యాణం.. కమనీయం



అయ్యవారిపల్లిలో లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



అచ్చంపేటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాయకులు

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లిలో సోమవారం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. 16వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వరుని పూజతో ఉత్సవాలను ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, దూప దీప నైవేద్యాలు చేపట్టారు. అనంతరం పుణ్యాహవాచన, నవగ్రహపూజ, సుదర్శన హోమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. వేద పండితులు శాస్త్రోక్తంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పల్లకీసేవలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డిలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పండితుల ఆశీర్వచనం పొందారు. ఆలయ కమిటీ చైర్మన్ యాదిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మోపతయ్య, కట్టా అనంతరెడ్డి, జగత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తిర్పతయ్య, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పెద్దమ్మ అమ్మవారి ఉత్సవాలు

మండల కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న యాదవుల ఆరాధ్య దైవం పెద్దమ్మ అమ్మవారి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు ఆలయం ఆవరణలో పెద్దమ్మ అమ్మవారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. యాదవ సంఘం నాయకులు బాల్‌నారాయణ యాదవ్, రాములుయాదవ్, తిర్పతయ్యయాదవ్, బుగ్గయ్యయాదవ్, జంగయ్యయాదవ్, కృష్ణయ్య యాదవ్, శ్రీనుయాదవ్, పర్వతాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి ..

అమ్రాబాద్: పదర మండలం రాయలగండిలో వెలిసిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆలయ కమిటీ సభ్యులు చిట్లంకుంట గ్రామ పెద్దల సమక్షంలో స్వామివారికి నాగవెల్లి నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తుల విగ్రహాలను మాధవానిపల్లి గ్రామానికి తరలించారు. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని బీమలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపతి పూజ, పుణ్యా వచనం, నవగ్రహ పూజ, మండప అర్చన, ప్రధాన కలశ స్థాపన, ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి నవగ్రహ సుదర్శన మహా రుద్రయాగం, కుంభాభిషేకం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో బీరప్ప ఉత్సవాలను కుర్వయాదవులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సోమవారం బోనాలు, బండారు కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. మరో రెండురోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు రామస్వామి, మల్లేష్ పేర్కొన్నారు.

కోడేరు: మండంలోని జనుంపల్లి శివారులో వెలసిన గంగా మంత్రాలమ్మ ఉత్సవాలు ఈ నెల 14 నుంచి కొనసాగుతున్నాయి. ప్రతిరోజు భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు. ఈనెల 24న నెల పూజ ముగింపు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి

అచ్చంపేట: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని అచ్చంపేట ఆర్డీఓ, ఏఆర్‌ఓ కె. మాధవి కోరారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎంసీఎంసీ కమిటీతో పాటు సర్వేలైన్స్ స్టాటిక్‌టీం, ఫ్లయింగ్‌స్క్వాడ్, వీడియో సర్వేలైన్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 85 ఏళ్ల వయస్సు పైబడి మంచానికి పరిమితమైన వారికి, 45 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు మాత్రమే హోమ్ ఓటింగ్‌కు ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందన్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల పరిధిలో 1,23,234 మంది పురుషులు, 1,24,382 మంది మహిళలు, ఇతరుల 5మంది మొత్తం ఇతరులు మొత్తం 2,47,621 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. గతంలో 265 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటికి అనుబంధంగా మరో 74 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుతో మొత్తం 339 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. చెంచుపెంటలు, ఇతర గ్రామాలకు సంబంధించి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న16,568 మంది ఓటర్ల కోసం కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అచ్చంపేటలో 18, లింగాల 6, వంగూరు 8, అమ్రాబాద్ 7, బల్మూర్ 3, చారకొండ 4, ఉప్పునుంతల 12, పదర 18 చొప్పున 76 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు గుర్తించినట్లు వెల్లడించారు. 9 పోలింగ్ కేంద్రాలకు ఒక రూట్ చొప్పున మొత్తం 44 రూట్లకు 44 మంది సెక్టోరల్ అధికారులను నియమిస్తున్నట్లు చెప్పారు. అచ్చంపేట జీఎంజే, మన్ననూర్, లత్తీపూర్ వద్ద మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, 3 షిఫ్ట్‌ల్లో మొత్తం 9టీంలు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీమోహన్, డీటీ రాములు, ఆర్ఐ కృష్ణాజీలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు కులస్తుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తీగల సుభాష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్లో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లోనే మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ తీగల సుభాష్, సెక్రెటరీ పాలమూరు సతీష్, కౌన్సిలర్లు సునేంద్ర, పద్మమ్మ, సంఘం సభ్యులు ప్రవీణ్, పాపమ్మ, వెంకటయ్య, నిరంజన్, మున్నూరు కాపు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



ఊర్కొండ: కోడేరు ఎంపీఓపై ఎంపీపీ చెప్పుతో దాడి చేయడాన్ని నిరసిస్తూ సోమవారం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఎంపీఓ, కార్యదర్శులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఎంపీపీపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కోడేరు: ఎంపీపీ కొండా వెంకట్ రాధపై చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది సోమవారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీఓ శ్రవణ్‌కుమార్‌పై దాడిని ఖండించారు. అనంతరం విధులను బహిష్కరించారు. కార్యక్రమంలోఎంపీడీఓ శ్రీనివాసులు, టీపీఎస్‌ఫ్ అధ్యక్షుడు రవితేజ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

వీపనగండ్ల: మండలంలోని పుల్గచర్ల మాజీ సర్పంచ్ ఎద్దుల వెంకట్‌రెడ్డి తన భార్య నారాయణమ్మ జ్ఞాపకార్థం రెడ్డిసేవా సమితి విద్యా ట్రస్ట్ కోసం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆర్థికంగా వెనకబడిన కుటుంబాల విద్యార్థులకు ఈ డబ్బులు ఉపయోగపడతాయన్న సదుద్దేశంతో సేవా సమితి సభ్యులకు విరాళం అందజేస్తున్నట్లు దాత వెంకట్‌రెడ్డి తెలిపారు.



ఈ పాస్‌తో ఎరువులు పంపిణీ



బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని రైతులకు సరఫరా చేసే ఆయా ఎరువులను వ్యాపారులు ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేసి పంపిణీ చేయాలని ఏఓ కమల్‌కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతు సేవ కేంద్రం ఇఫ్కో ఎరువుల గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ నిర్వాహకులతో మాట్లాడుతూ రైతుల ఆధార్‌కార్డు ద్వారా ఎరువులను అందజేయాలని సూచించారు.

వాహనాల తనిఖీ



వెల్దండ: మండల కేంద్రంలో హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై సోమవారం సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. అక్రమంగా నగదు డబ్బులు, మద్యం తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రవి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

జాబ్ కార్డులు ఉన్నవారందరికీ ఉపాధి

లింగాల: జాబ్ కార్డు ఉన్న కూలీలకు ఉపాధి కల్పిస్తామని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని బాకారంలో పూడిక తీసే పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూలీల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు సూచించారు. కూలీల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అదేవిధంగా కోమటికుంటలో నర్సరీ పనులను ఆయన పరిశీలించారు. మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ కర్ణనాయక్, ఏపీఓ ఇమాంఅలీ, టీఏలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



బిజినేపల్లి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని తిమ్మాజిపేట ఎంపీడీఓ లక్ష్మీదేవి అన్నారు. సోమవారం మండలంలోని పోతిరెడ్డిపల్లిలోని పల్లె ప్రకృతి వనాన్ని, నాటిన మొక్కలను, గ్రామ పంచాయతీ పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఎండాకాలంలో ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీటిని అందించి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ సొమ్మును ప్రజలకు పంచాలి

మన్ననూర్: మాజీ సీఎం కేసీఆర్ కూతురు ఎమ్మెల్సీ కవిత అక్రమ ఆస్తులను ప్రజలకు పంచాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటరమణ అన్నారు. సోమవారం మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కల్వకుంట కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుని సంపాదించిన అక్రమ సొమ్మును రాష్ట్ర ప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు. బంగారు తెలంగాణ, బతుకమ్మ పేరుతో రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత రూ. 128 కోట్ల ఆస్తులు ఎలా సంపాదించారో ప్రజలకు తెలపాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీ రహీం, నాయకులు వెంకటేశ్వర్లు, జాకీర్, సత్యనారాయణ, వెంకటయ్య, తుల్యా, రవూఫ్, మధు, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు

లింగాల: ఇతర పార్టీల నుంచి వచ్చే వారిని అధికార కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తీర్మానించారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు అధ్యక్షతన ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇతర పార్టీల నాయకుల చేరికపై చర్చించారు. ఆస్తులను, పనుల కోసం ఇతరులు అధికార పార్టీలో చేరేందుకు చూస్తున్నారని పలువురు తెలిపారు. ఇతరులు పార్టీలో చేరితే తమ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, విలువలు ఉండవని వాపోయారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్దామని అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, లక్ష్మణ్‌నాయక్, కొండల్‌రావు, మల్లయ్య, జ్ఞానేశ్వర్‌రెడ్డి, షఫీ, బుడ్డయ్య, రాజులయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

తెలకపల్లి: మండలంలోని పర్వతాపూర్‌లో బోర్డియాక్స్ మిశ్రమం తయారీ విధనంపై సోమవారం రావేఫ్ విద్యార్థులు అవగాహన కల్పించారు. రైతులకు ప్రదర్శన ద్వార చూపించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. బోర్డియాక్స్ మిశ్రమాన్ని కాఫర్, సల్ఫేట్, సున్నం, నీరు 1.1.100 నిష్పత్తిలో కలిపి సాధారణంగా 10 శాతం బోర్డియాక్స్ మిశ్రమాన్ని వేర్లు, కాండం వంటి భాగాలకు వాడాలని సూచించారు. 0.50 శాతం మిశ్రమాన్ని ఆకులపై పిచికారి చేసుసునేందుకు వినియోగించాలన్నారు. ద్రావణాన్ని మెటల్ పార్సల్‌లో తయారు చేసుకోరాదని ప్రతిసారి బోర్డియాక్స్ మిశ్రమాన్ని తాజాగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. టమాట, మిరప ఇతర కూరగాయలు, తోట పంటలు మామిడి, నిమ్మ, నారింజ వంటి పంటలపై వాడుకోవచ్చాన్నారు. కాండం తెగుళ్లు, ఆకుమచ్చ, ఆకుముడత, క్యాంకర్‌లను నివారిస్తుందని సూచించారు. కార్యక్రమంలో రావేప్ విద్యార్థులు ద్వార కామై, విశ్వతేజ, శ్వేత, సుభద్ర, రైతులు సాయిబాబు, నిరంజన్, అంజనమ్మ, పాండు, తిరుపతయ్య, నాగయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి: వేసవికాలం దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అధికారులను కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ పైపులైన్ లీకేజీలు, మరమ్మతు కాలిపోయిన బోర్లకు మరమ్మతు చేయించి నీటి ఎద్దడి నివారణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాల కొరత ఉందని వాటిని మంజూరు చేయించాలని పంచాయతీ కార్యదర్శులు సభ దృష్టికి తీసుకురాగా దీనికి విద్యుత్ ఏఈ ప్రదీప్‌గౌడ్ స్పందిస్తూ అవసరమున్న గ్రామాలకు స్తంభాల కోసం ప్రతిపాదనలు పంపించామని మంజూరు అయిన వెంటనే పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, వైస్ ఎంపీపీ దీపికలక్ష్మణ్‌రావు, వెన్నచెర్ల ఎంపీటీసీ రవికుమార్, పెద్దకొత్తపల్లి ఎంపీటీసీ శశికళ, పెద్ద కార్వాముల ఎంపీటీసీ ఆంజనేయులు, ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఈ లీలావతి

చారకొండ: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యుత్ అధికారిణి లీలావతి హెచ్చరించారు. మండలంలోని జూపల్లిలో సబ్‌స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, సందర్శించి, విద్యుత్ సంబంధిత రికార్డులను పరిశీలించారు. అనంతరం సబ్‌స్టేషన్‌లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్లు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉచిత విద్యుత్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. కల్వకుర్తి ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ జానకిరామ్ నాయక్, జేఎల్ఎం బాలునాయక్, అయూబ్ ఖాన్, వెంకటయ్య, ఆపరేటర్స్ పరంజ్యోతి, దయాకర్, బుచ్చయ్యగౌడ్, మహేష్, శ్రీశైలం, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో ఎంపీపీ చేరిక



తెలకపల్లి: ఎంపీపీ కొమ్ము మధుతో పాటు పెద్దూరు ఎంపీటీసీ సభ్యుడు లింగమయ్య సోమవారం నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి సమక్షంలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ తిరుపతయ్య, రహీం, విష్ణు, పానుగంటి లింగం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్యగౌడ్, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని ఫిరట్వానిపల్లి ఎంపీటీసీ బూరం మల్లేష్ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, నాయకులు నర్సింహ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

అచ్చంపేట రూరల్: బీఆర్ఎస్ చెందిన ఎంపీటీసీలు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో ఘన్‌పూర్ ఎంపీటీసీ సభ్యుడు హరిలాల్, మన్నెవారిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు చంద్రకళ భర్త రవీందర్, ఆంజనేయులు తండా నుంచి నర్సింహ, మోతీలాల్, ఘనపూర్ సతీష్ ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓకు ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ క్రైం: అర్హతలేని ఆర్‌ఎంపీలపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటదాసుకు సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని గుడ్లనర్వ గ్రామానికి చెందిన అరవింద్ గతనెల 15న కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని న్యూలైఫ్‌పాలిక్లినిక్‌కు వచ్చాడు. ఆర్‌ఎంపీ వైద్యుడు సమీ పరీక్షించి ఆరునెలలకు సరిపడ మందులు ఇచ్చాడు. మందులు వాడిన మూడు వారాలకు బాధితుడి చర్మం పొడిబారి, బరువు తగ్గి మంచానికే పరిమితమయ్యాడని వివరించారు. అర్హతలేని ఆర్‌ఎంపీ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓకు ఫిర్యాదు చేశారు. బీఎస్పీ జిల్లా ప్రెసిడెంట్ పృథ్వీరాజ్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కల్యాణ్, రాము, రాంచందర్ ఉన్నారు.

కారును ఢీకొట్టిన లారీ: ఒకరికి తీవ్రగాయాలు

బల్మూర్: మండలంలోని అచ్చంపేట–నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి మహాదేవ్‌పూర్ స్టేజీ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తెలకపల్లి మండలంలోని రాకొండకు చెందిన కొకుంట్ల కృష్ణయ్యగౌడ్ కారులో అచ్చంపేట వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. రాకొండ నుంచి చేపల లోడ్‌తో అచ్చంపేట వైపు వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణయ్యగౌడ్ కాలుకు, చేతికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం



నాగర్‌కర్నూల్‌లో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



చారకొండలో హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. మన్ననూర్ పరీక్ష కేంద్రంలో మొత్తం 273 విద్యార్థులకు గాను 272 విద్యార్థులు పరీక్ష రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ నాగయ్య తెలిపారు. కోడేరు మండలంలో రెండు పరీక్ష కేంద్రాల్లో 319 మంది విద్యార్థులకు మొత్తం హాజరయ్యారు. వెల్దండలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 151మంది, మోడల్ హైస్కూల్‌లో 210మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒక్కరు కూడ గైర్హాజరు కాలేదు. పెద్దకొత్తపల్లి మండలంలోని మూడు సెంటర్‌లలో 566 మంది విద్యార్థులకు అందరూ హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కొండారెడ్డి తెలిపారు. బల్మూరు కేజీబీవీలో 112 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్‌లో 298 మంది వంద శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. తెలకపల్లి మండలంలోని గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో 172 మందికి 172 మంది, తెలకపల్లి బాలికల గురుకుల పాఠశాలలో 210 మంది విద్యార్థులకు 210 మంది విద్యార్థులు హాజరయ్యారు. కేకేరెడ్డి ఉన్నత పాఠశాలలో 190 మందికి 189 మంది విద్యార్థులు హాజరు కాగా ఒక విద్యార్థి గైర్హజరయ్యారు. చారకొండలో మొత్తం విద్యార్థులు 202 మంది విద్యార్థులకు అందరూ హాజరైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. తాడూరులో రెండు రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 393 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 392 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఉప్పునుంతలలో 166 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని చీఫ్ సూపపింటెండెంట్ మల్లికార్జున్, డిపార్టుమెంటల్ ఆఫీసర్ జాఫర్ తెలిపారు. కొల్లాపూర్ పట్టణంలోని నాలుగు సెంటర్లలో మొత్తం 727 మంది విద్యార్థులకు 726 మంది విద్యార్థులు హాజరయ్యారు. పెంట్లవెల్లిలోని 102 మంది విద్యార్థులకు 102 మంది విద్యార్థులు, జటప్రోల్‌లోని 95 మందికి 95 మంది విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు హాజరైనట్లుగా ఎంఈఓ చందునాయక్ పేర్కొన్నారు. అదేవిధంగా రెండు పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ హిమబిందు తనిఖీ చేశారు. లింగాల ఉన్నత పాఠశాలలో 111 మంది విద్యార్థులు, సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల కేంద్రంలో 168 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కల్వకుర్తి మండలంలోని మార్చాల పరీక్ష కేంద్రంలో 296 మంది విద్యార్థులకుగాను 295 మంది విద్యార్థులు హాజరయ్యారని ఒకరు గైర్హాజరు అయినట్లు మండల విద్యాధికారి బాసునాయక్ పేర్కొన్నారు.